




చిన్న తండా.. పెద్ద కొలువులు.. 2



గుప్త నిధుల పేరిట మోసం 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com


## రేపు ఎస్సారెస్పీకి మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు రాక



**అక్షరటుడే, ఆర్మూర్:** ఎగువ కురుస్తున్న వర్షాలతో తెలంగాణ వరప్రదాయిని శ్రీ రాంసాగర్ ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది. ఎల్‌నినో ప్రభావంతో వానలు ఆలస్యం కావడంతో ప్రాజెక్ట్ ఇన్నాళ్లు వెలవెలబోయింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శనివారం ఎస్సారెస్పీని సందర్శించనున్నారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి కార్యాలయం నుండి శ్రీరాం సాగర్ ప్రాజెక్టు అధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది.



## శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరుగుతున్న వరద..



**అక్షరటుడే, మెండోరా (బాల్కొండ):** ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కు వరద వస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి జలాశయంలోకి వరద వస్తుండడంతో ప్రాజెక్ట్‌లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. 24 గంటల వ్యవధిలో ప్రాజెక్టులోకి ఐదు టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ఇదే తరహాలో వరద నీరు వస్తే కొన్ని రోజులలో శ్రీరాం సాగర్ నిండుకుండగా మారనుంది. శ్రీరాంసాగర్ పూర్తి నీటి మట్టం 1,091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 22.053 టీఎంసీలకు చేరింది. గత యేడు ఇదే సమయానికి ప్రాజెక్టులు 1,077 అడుగులు (38 టీఎంసీలు) గా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 65,422 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. మిషన్ భగీరథ 231 క్యూసెక్కులు, ఆవిరి 291 క్యూసెక్కులు , కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు మొత్తం 822 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో నుంచి బయటకు వెళ్తోంది. ఉత్తర తెలంగాణతో పాటు మహారాష్ట్రలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి ఆశాజనకంగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోని 6 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ పంటలకు సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## ఊర పండుగకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు: సీపీ



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలో ఆదివారం నిర్వహించనున్న ఊర పండుగకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని శుక్రవారం దేవతామూర్తులు తయారుచేసే ప్రాంతాలు, ఊరేగింపు రూట్‌ను ఆయన పరిశీలించారు. మొదటగా ఊర పండుగకు సంబంధించి దేవతామూర్తులు తయారవుతున్న కొండెంగ హన్మాండ్లు ఆలయం వద్ద తనిఖీలు నిర్వహించారు. అనంతరం అక్కడినుంచి గోల్‌హన్మాన్, సిర్నాపల్లి గడి తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖిల్లా చౌరస్తా నుంచి దేవతామూర్తులు ఊరేగింపు సందర్భంగా ఆద్యంతం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఖిల్లా చౌరస్తా నుంచి లక్ష్మీ మెడికల్, పులాంగ్, మహాలక్ష్మి నగర్ దుబ్బ ప్రాంతాల్లోనూ పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. ప్రజలు సైతం పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్వ సమాజ్ కమిటీ ప్రతినిధి రామర్తి గంగాధర్, కార్పొరేటర్ మహేందర్, రామడుగు బాలకిషన్, నరేష్, సీఐలు సతీష్, శ్రీనివాస్ రాజ్, వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, ఎస్సై యాదగిరి, సీసీఎస్ సీఐ, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వసూళ్లకు పాల్పడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్




**అక్షరటుడే, కామారెడ్డి:** రహదారిపై వెళ్తున్న వాహనాలను నిలిపివేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30న మద్నూర్ పరిధిలోని సలాబత్ పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డి విధుల్లో ఉన్నాడు. అయితే ఆయన మరొక ప్రైవేట్ వ్యక్తితో కలిసి వచ్చిపోయే వాహనాలను నిలిపి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సదరు కానిస్టేబుల్ వసూళ్లకు పాల్పడుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ముకుంద రెడ్డి స్పందించారు. ఘటనపై విచారణ జరిపి అతన్ని సస్పెండ్ చేయాలని కరీంనగర్ నోడల్ కార్యాలయానికి నివేదిక పంపించారు. శుక్రవారం కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ కరీంనగర్ నోడల్ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు ముకుంద రెడ్డి తెలిపారు. సంబంధిత ఉత్తర్వులు కానిస్టేబుల్ సుధాకర్ రెడ్డికి అందజేసినట్లు పేర్కొన్నారు.



## వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ మేరకు ఆర్మూర్ డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఇలాంటి పరిస్థితుల్లో అధికారుల సన్నద్ధత, అప్రమత్తతపై తగిన సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



### అధిక వడ్డీ పేరుతో

కష్టపడకుండా కూర్చున్న చోటో డబ్బు సంపాదించడమే ధ్యేయంగా యువత చెడుదారిని ఎంచుకుంటున్నారు. జల్సాలకు అలవాటు పడి బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ ద్వారా అమాయక ప్రజలకు ఎర వేస్తున్నారు. అత్యాశకు పోయి మోసగాళ్ల బారిన పడుతున్నారు కొందరు అమాయక ప్రజలు. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు. ఏకంగా 7వేలకు పైగా ప్రజలు మోసపోవడం గమనార్హం.

- అక్షరటుడే, కామారెడ్డి

# 'ఆన్‌లైన్' ఉచ్చు..

- అధిక డబ్బుల ఆశచూపి పెట్టుబడి పెట్టేలా ప్లాన్
- దుబాయి నుంచి వచ్చి వాట్సాప్ ద్వారా లీడ్
- కమీషన్ కోసం అమాయకులతో ఆటలు
- మోసపోయిన ఏడువేల పైచిలుకు బాధితులు

కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ యువకుడు దుబాయిలో ఓ కంపెనీలో పనిచేసి తిరిగొచ్చాడు. అనంతరం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టించేలా అమాయకులను మోసం చేస్తున్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు వెల్లడయ్యాయి. ఈ ఘటనలో భాగస్వామ్యమై పెట్టుబడి పెట్టిన ప్రజల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**అధిక డబ్బుల ఆశ చూపి..**

రామారెడ్డి మండలానికి చెందిన బుక్యా నవీన్ అలియాస్ నరేష్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో పని చేస్తుండగా వారి ఆన్‌లైన్ గేమింగ్ యాప్ గురించి పూర్తిగా తెలుసుకున్నాడు. ఉద్యోగం ముగించుకుని స్వదేశానికి తిరిగి వస్తుండగా, ఆ కంపెనీ అతనికి ఒక ఆఫర్ ఇచ్చింది. "మా యాప్‌లో ఇండియాలో పెట్టుబడులు పెట్టించు. ప్రతి పెట్టుబడిపై 5 శాతం కమిషన్ ఇస్తాం" అని ఒప్పందం కుదుర్చుకుంది. కమిషన్ ఆశతో నవీన్ ప్రతిపాదనకు ఒప్పుకున్నాడు. అధిక లాభాల పేరుతో ప్రజలను ఆకర్షించేందుకు ముందే ప్లాన్ చేసిన కుట్రగా పోలీసుల విచారణలో తేలింది.

**దుబాయి నుంచి వచ్చి..**

ఒప్పందం ప్రకారం దుబాయ్ కంపెనీ నవీన్‌కు అక్కడి కొన్ని సిమ్ కార్డులను ఇచ్చి ఇండియాకు పంపించింది. ఇండియాకు వచ్చిన తర్వాత నవీన్ ఆ విదేశీ సిమ్‌లను ఉపయోగించి వాట్సాప్ ద్వారా ప్రజలకు కాల్స్ చేయడం ప్రారంభించాడు. కంపెనీకి చెందిన feature9.com అనే ఆన్‌లైన్ గేమింగ్ వెబ్ సైట్‌ను తెలిసిన వారితో మొదలుపెట్టి, తెలియని నంబర్లకు కూడా పంపించి వాట్సాప్ మెసేజ్‌లు, కాల్స్ చేసేవాడు. 'ఈ లింక్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం గ్యారెంటీ' అంటూ యాప్ లింకులు పంపేవాడు. దుబాయి నుంచి వస్తున్న కాల్ అనే నమ్మకంతో చాలా మంది అతని మాటలను నమ్మారు. ఇలా వాట్సాప్ ద్వారా పెద్ద ఎత్తున లీడింగ్ చేసి ప్రజలను తన వైపు తిప్పుకున్నాడు.

**కమిషన్ కోసం అమాయకులతో ఆటలు**

నవీన్ ప్రధాన ఉద్దేశం కమిషన్ సంపాదించడమే. అందుకోసం అమాయక ప్రజలతో ఆటలు ఆడాడు. మొదట చిన్న మొత్తం పెట్టుబడి పెట్టిన కొందరికి తిరిగి కొంత మొత్తం ఇచ్చి నమ్మకం కలిగించాడు. ఆ తర్వాత




పెద్ద మొత్తాలు పెట్టేలా ఒత్తిడి చేశాడు. ప్రజలు రూ.వెయ్యి నుంచి మొదలుకుని రూ.7 వేల వరకు ఆ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. వారు చెల్లించిన డబ్బు మొత్తం ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ ద్వారా నేరుగా దుబాయ్‌లోని కంపెనీ అకౌంట్‌లోకి వెళ్లిపోయేది. ప్రతి ట్రాన్సాక్షన్ జరిగిన వెంటనే కంపెనీ నవీన్‌కు 5శాతం కమిషన్‌ను తిరిగి పంపేది. ఈ విధంగా అతను కమిషన్ రూపంలో భారీగా డబ్బు సంపాదించాడు. ఇలా నవీన్ ద్వారా మొత్తం 7,633 మంది ప్రజలు ఆ యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. మొదట్లో లాభాలు వస్తాయని ఆశపడ్డ బాధితులకు ఆ తర్వాత అసలు డబ్బే తిరిగి రాలేదు. దీంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదులు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కేసులో పోలీసులు నవీన్‌తో పాటు అతడికి సహకరించిన ప్రవీణ్‌ను అరెస్ట్ చేశారు.

**అప్రమత్తంగా ఉండాలి**

ప్రజలు ఆన్‌లైన్ పెట్టుబడుల జోలికి వెళ్లే ముందు పూర్తిగా ఆలోచించాలి. అత్యాశకు పోయి మోసపోవద్దు. తెలియని లింకులు, విదేశీ నంబర్ల నుంచి వచ్చే ఆఫర్లను నమ్మవద్దు. అనుమానం వస్తే వెంటనే సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయాలి. గేమింగ్, బెట్టింగ్ యాప్స్, ఇతర ఆఫర్లకు సంబంధించిన లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- రాజేష్ చంద్ర, ఎస్పీ కామారెడ్డి

## ఆషాఢమాసంలో ప్రత్యేకం ఊర పండుగ



**అక్షరటుడే, ఇందూరు:** ఆషాఢ మాసంలో గ్రామదేవతలను ప్రత్యేకంగా పూజించడం ఆనవాయితీగా వస్తుందని.. దీంట్లో భాగంగానే ఊరపండుగ నిర్వహిస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలో ఊర పండుగ రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఖిల్లా వద్ద అమ్మవార్ల గద్దె నుంచి గాజులపేట్, పెద్ద బజార్ మీదుగా వెళ్లే అమ్మవార్ల రూట్ మ్యాప్‌ను శుక్రవారం పరిశీలించారు. అలాగే మామిడి చెట్టు కర్రలతో నిష్ఠగా చేసే దేవతా మూర్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 2న ఇందూరులో సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఊరపండుగ ఘనంగా నిర్వహిస్తున్నారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తి చేస్తున్నారన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గద్దెను లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అదనపు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ ప్రతినిధులు బంటు రాజేశ్వర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మల్కాయి మహేందర్, జగదీష్ కులకర్ణి, బంటు రాము, పసునూరి రాము, బెల్లాల్ శశాంక్, వైష్ణవి సుధా, కల్పే అర్చనా చిరంజీవి, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పల్లె దవాఖానాను తనిఖీ చేసిన పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** పల్లె దవాఖానాలో నాణ్యమైన సేవలందించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని పాత బాన్సువాడ పల్లె దవాఖానాను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, చికిత్సలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశమై ఆస్పత్రిలో ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. రోగులకు అవసరమైన మందులు, వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజల్లో అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఆదిలాబాద్, ఆర్మూర్ రైల్వే లైన్‌కు డీపీఆర్ పూర్తి

**అక్షరటుడే, ఆర్మూర్/ఇందూరు :** ఆదిలాబాద్ -ఆర్మూర్ రైల్వే లైన్‌కు డీపీఆర్ పూర్తయిందని.. త్వరలోనే అప్రూవల్‌కు పంపనున్నట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడం, కొత్త రైల్వే మార్గాల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల విస్తరణ, రైల్వే మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన రైల్వే ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు తగిన నిధులు మంజూరు చేసి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. నగరంలోని పలు వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. ఎంపీ అర్వింద్‌తో కలిసి ఢిల్లీలో మంత్రిని కలిశారు. ప్రతిపాదనలను మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డునాందేవ్‌వాడ (ఆర్‌వోబీ) అదనపు వంతెన



మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ రైల్వే లైన్ దాటడానికి విజయ థియేటర్, అలాగే నాందేవ్‌వాడ వద్ద రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయన్నారు. కావున నూతన ఆర్‌వోబీ మంజూరు చేయాలన్నారు. అలాగే ఎల్లమ్మగుట్ట వద్ద సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో మరొక ఆర్‌యూబీ అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రూ.170 కోట్లు మంజూరుకావాలన్నారు. సమావేశంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ తనిఖీలు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కామారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైల్వే స్టేషన్ సమీప ప్రధాన రోడ్డుపై కొన్ని రోజులుగా నిలిచి ఉన్న వర్షపు నీటిని తొలగించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆవరణలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేసి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు ప్రవహిస్తుండడంతో కలెక్టర్ అక్కడికి చేరుకున్నారు. సంప్రదాయ పూజలో పాల్గొన్న అనంతరం చెరువు పరిసరాలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.



ప్రజలు చెరువు వైపు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని మున్సిపల్, పోలీసు అధికారులను ఆదేశించారు. జీఆర్ కాలనీలో పర్యటించిన కలెక్టర్, అక్కడి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఎన్‌వై గిరి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, తహశీల్దార్ హిమబిందు, స్థానిక కౌన్సిలర్లు, ఇంజినీర్లు ఎన్ హన్మంతరావు నాయక్, వినీత్, సీహెచ్ వేణుప్రసాద్ తదితరులు ఉన్నారు.

## వర్షా కాలంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే, బాల్కొండ:** వర్షాకాలంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ సూచించారు. మండలంలోని కిసాన్‌నగర్ పీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణ, వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలోని ఓపీ విభాగం, ఫార్మసీ, ల్యాబొరేటరీ, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కేంద్రాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, ల్యాబ్ పరీక్షలు, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విరేచనాల వంటి సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున జ్వరంతో వచ్చే ప్రతి రోగికి అవసరమైన పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించేది లేదు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీగౌడ్ హెచ్చరించారు. 'ఫీజు బకాయి – బీజేపీ లడాయి'లో భాగంగా ఆర్మూర్ నియోజకవర్గంలోని క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో మిస్డ్ కాల్, క్యూఆర్ కోడ్ ద్వారా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వంశీ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఫీజులు చెల్లించలేక వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, కొంతమంది అప్పులు చేసి చదువులు కొనసాగించే పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

ఒకరు దేశ సరిహద్దుల్లో సైనికుడిగా సేవలందిస్తున్నారు.. మరొకరు రాష్ట్రంలో పోలీసు శాఖలో చేరి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. మరికొందరు ఉపాధ్యాయులు, లెక్చరర్లుగా ఉద్యోగాలు సాధించారు. ఇలా తండాలో పలువురు యువకులు సర్కారు కొలువులు సాధిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు కేరాఫ్ ఆడ్రస్‌గా మారిన నేరల్‌తండాపై ప్రత్యేక కథనం..

– అక్షరటుడే, గాంధారి




# చిన్న తండా.. పెద్ద కొలువులు..

■ ఆదర్శంగా నిలుస్తున్న నేరల్ తండా ■ సర్కారు కొలువుకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన గ్రామం ■ స్ఫూర్తిగా నిలుస్తున్న యువకులు..

గాంధారి మండలంలోని నేరల్ తండాలో జనాభా మూడువేల వరకు ఉంటుంది. అయితే ఈ తండా నుంచి సుమారు 32 మంది ప్రభుత్వ కొలువులు సాధించారు. అందులో ముఖ్యంగా 21 మంది యువకులు ఆర్మీకి సెలక్ట్ అయ్యారు. 8 మంది పోలీస్‌శాఖలో సేవలందిస్తున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు, లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

### మిషన్ 2027 లక్ష్యంగా..

తమ గ్రామాన్ని రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా యువత, గ్రామస్థులు ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం తండాలో 35నుంచి 40శాతం వరకు కుటుంబాల్లో ఉద్యోగాలు సాధించిన వారు ఉండగా.. 'మిషన్ 2027'లో భాగంగా దీనిని 70శాతానికి పైగా పెంచాలని ప్రణాళికతో యువత చదువుకుంటున్నారు. దీనికి అనుగుణంగా పదో తరగతి, ఇంటర్ పూర్తయిన విద్యార్థులు కూడా ఇప్పటినుంచే పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండడం గమనార్హం.

### ఉద్యోగులకు సన్మానం.. చిన్నారుల్లో ఉత్తేజం..

కొత్తగా ఉద్యోగాలు సాధించిన వారికి తండాపెద్దలు ప్రత్యేకంగా సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. వారు ఎంచుకున్న మార్గం, పడ్డ కష్టం గురించి చిన్నారులకు స్పష్టంగా వివరిస్తారు. వారి మనస్సుల్లో ఉన్నత ఆశయాల బీజం వేస్తారు. చిన్నతనం నుంచే గమ్యాన్ని నిర్దేశించుకునేలా ప్రోత్సహిస్తారు.

### ఎస్టీ రిజర్వేషన్ వస్తే మరిన్ని ఉద్యోగాలు..

ప్రస్తుతం తమ సామాజిక వర్గం బీసీ–డీ జాబితాలో ఉండడం వల్ల పూర్తిస్థాయి రిజర్వేషన్ ఫలాలు అందట్లేదని గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు. ఒకవేళ తమను ఎస్టీ జాబితాలో చేరిస్తే మరింత ఎక్కువ మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తండావాసులు పేర్కొంటున్నారు. తమ విషయమై ఇప్పటికే సీఎం కూడా కలిసి విన్నవించినట్లు చెప్పారు.

### మా తండా అందరికీ ఆదర్శంగా నిలవాలి



ఎంతో కష్టపడి ఉన్నతస్థాయి ఉద్యోగం సాధించి అందరి మన్ననలు పొందడం చాలా సంతోషంగా ఉంది. మా చిన్న తండా నుంచి ఇంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం గర్వకారణం. రాబోయే రోజుల్లో మరింత మంది ఉద్యోగాలు సాధించి మా తండాను అందరికీ ఆదర్శంగా నిలపాలని కోరుకుంటున్నాను. – **బస్సీ రమేష్, ఆర్మీ జవాన్**

### కష్టాన్ని ఇష్టపడితే విజయం సాధించవచ్చు..



మేం చదువుకునే రోజుల్లో సరైన రవాణా సౌకర్యాలు లేక స్కూల్‌కు వెళ్లేందుకు ఎన్నో అవస్థలుపడేవాళ్లం. అన్నింటినీ జయించి ఈ రోజు ఈ స్థాయిలో నిలబడడం గర్వంగా ఉంది. నిరాశను వదిలి శ్రమిస్తే ప్రతి అడ్డంకి తొలగిపోయి అనుకున్న గమ్యాన్ని చేరుకోవచ్చు.

– **బర్తవాల్ మేగరాజ్, జూనియర్ లెక్చరర్**



## బాధిత కుటుంబాలను సునీల్‌రెడ్డి పరామర్శ

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్ల గ్రామంలో ఇటీవల కుటుంబ సభ్యులను కోల్పోయిన రెండు కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన అనీష్ తల్లి, గుండెపోటుతో మరణించిన చాకలి రాజేందర్ కుటుంబాలను కలిసి ఆయన సానుభూతి వ్యక్తం చేశారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



## ప్రపంచానికే స్ఫూర్తినిస్తున్న దేశం భారత్..

**అక్షరటుడే, ఇందూరు:** కుల మతాలకతీతంగా ప్రపంచానికే తలమానికంగా నిలిచింది మన భారత దేశమని టీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోతంగల్ రాంకిషన్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మారుతి నగర్‌లో స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు ప్రిన్సిపాల్ జ్యోతి, కార్యదర్శి ఎస్ సిద్దయ్య ఆధ్వర్యంలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో నిర్వహించారు. అనంతరం రాం కిషన్ రావు మాట్లాడుతూ వందేమాతర గీతాన్ని పార్లమెంట్‌లో జూలై 31న ఆమోదించారన్నారు. కుల మత వర్గ విభేదాలు లేకుండా 140 కోట్ల మందితో భారత దేశం ప్రజాస్వామ్య దేశంగా ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. దేశ రక్షణ కోసం వివిధ దేశాల నుంచి ఎలాంటి ప్రమాదాలు రాకుండా ఉండేందుకు మైనస్ డిగ్రీ సెంటీగ్రేడ్లలో భారత సైనికులు తమ ప్రాణాలను ఫలంగా పెట్టి కాపాడుతున్నారని తెలిపారు. భారతమాత రక్షణ, దేశ సమైక్యతను చాటి చెప్పే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్నేహ సొసైటీ సభ్యులు తాటి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

## కాలకృత్యాలకు వెళ్లి ఒకరు మృతి

**అక్షరటుడే, కోటగిరి :** కాలకృత్యాలకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన పోతంగల్ మండలం కొల్లూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హన్మంత్ (48) కాలకృత్యాలకు వెళ్లగా అక్కడ ఫిట్స్ వచ్చి పంట పొలాల్లో పడిపోయి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## ఒక్క ఓటు కూడా తప్పిపోకుండా చూడాలి: సుదర్శన్ రెడ్డి



**అక్షరటుడే, ఆర్మూర్:** ఎస్ఐఆర్‌లో ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా చూడాలని ప్రభుత్వ సలహాదారు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుదర్శన్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బాల్కొండ, ఆర్మూర్ ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ 100శాతం సాధించిందనడానికి చెప్పేందుకు గర్విస్తున్నామన్నారు. 25,330 ఓట్ల వరకు డబుల్ ఓట్లు ఉన్నాయని అవన్నీ కూడా తీసేసి 100శాతం రెండు రోజుల క్రితమే కంప్లీట్ చేయడం జరిగిందన్నారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి బర్త్‌డే సందర్భంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, తెలంగాణ మినరల్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్, నుడా ఛైర్మన్ కేశ వేణు, తెలంగాణ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ మార చంద్రమోహన్ రెడ్డి, బాల్కొండ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత తదితరులు పాల్గొన్నారు.

## గుప్తనిధుల పేరుతో ఘరానా మోసం..

# అప్పు కింద రంగురాళ్లు అంటగట్టిన కేటుగాడు..!



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తీసుకున్న అప్పు తీర్చాలని అడిగితే గుప్తనిధుల్లో దొరికిన బంగారమని చెప్పి రంగు రాళ్లు అంటకట్టాడు. ఈ ఘరానా మోసం డిచ్‌పల్లి మండల పరిధిలో వెలుగు చూసింది. ఎస్సై ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని హమాల్‌వాడికి చెందిన పిల్ల రమేష్ కుమార్.. ఇంటి ముందు శ్రీనివాస్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి గత 15ఏళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో రమేష్ వద్ద శ్రీనివాస్ రూ.1.30 లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు తీర్చమని రమేష్ ఎన్నిసార్లు ఒత్తిడి చేసినా శ్రీనివాస్ ఏవేవో కారణాలు చెబుతూ వాయిదా వేస్తూ వచ్చాడు. డబ్బులు తిరిగి ఇచ్చే ఉద్దేశం లేకపోవడంతో శ్రీనివాస్ మోసానికి తెరలేపాడు. తనకు గుప్తనిధుల్లో బంగారం దొరికిందని, అప్పుకు బదులుగా ఆ బంగారాన్ని ఇస్తానని రమేష్‌కు ఆశ చూపాడు. అయితే విషయం బయటకు తెలియకూడదని, ఇంటి దగ్గర కాకుండా వేరే ప్రదేశంలో కలవాలని సూచించాడు. అంతేకాకుండా, బంగారం ఇస్తున్నందుకు అదనంగా మరో రూ.32 వేలు ఇవ్వాలని మెలిక పెట్టాడు. శ్రీనివాస్ మాటలను నమ్మిన రమేష్.. గురువారం డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లోని తన చుట్టాల ఇంటికి చేరుకుని నిందితుడికి సమాచారం అందించాడు. అక్కడకు చేరుకున్న శ్రీనివాస్ కుండలో ఉన్న నాలుగు బంగారం రంగు పూసిన రాళ్లను రమేష్‌కు ఇచ్చి, అప్పుతో పాటు అదనంగా తెచ్చిన డబ్బును తీసుకుని అక్కడి నుంచి జారుకున్నాడు. వాళ్లు వెళ్లాక అనుమానం వచ్చి సరిగ్గా పరిశీలించగా.. అవి బంగారం కాదని, కేవలం రంగు పూసిన రాళ్లని తేలడంతో రమేష్ షాక్‌కు గురయ్యాడు. దారుణంగా మోసపోయానని గ్రహించిన బాధితుడు డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించినట్లు ఎస్సై ఆరిఫ్ తెలిపారు.

## సస్పెండ్ అయిన నర్సింగ్ సిబ్బందికి యూనియన్ అండ



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో ఇటీవల సస్పెండ్ అయిన నర్సింగ్ సిబ్బందికి తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్, తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ అసోసియేషన్ నాయకులు అండగా నిలిచారు. ఆస్పత్రిని శుక్రవారం సందర్శించిన రాష్ట్ర నాయకులు బాధిత నర్సింగ్ అధికారులను కలిసి వారికి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సస్పెండ్ అయిన ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ పూర్తి స్థాయిలో పోరాడుతుందని భరోసా ఇచ్చారు. సమస్య పరిష్కారం కోసం అన్ని స్థాయిల్లో చర్యలు తీసుకుంటామని, ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ అంశాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లామని, సమస్యను సమగ్రంగా వివరించామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ మూర్తి, ప్రధాన కార్యదర్శిపరబ్ కుమార్, లలిత కుమారి, తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రేణుకతో పాటు జ్యోతి, శ్రీనివాస్, అమృత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్



**అక్షరటుడే, ఆర్మూర్:** తిరుమల వేంకటేశ్వర స్వామిని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. కాలినడకన మెట్ల ద్వారా తిరుమలకు చేరుకొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామిని ప్రార్థించారు.



## బీసీ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** యూపీఎస్సీ సివిల్స్ ప్రిపేర్ అవుతున్న ఉద్యోగార్థులకు బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ అందజేస్తున్నారని అదనపు కలెక్టర్ భుజంగ రావు పేర్కొన్నారు. ఈ మేరకు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఉచిత శిక్షణ తీసుకోవాలనుకునే అభ్యర్థులు వచ్చేనెల 7వ తేదీ లోపు నిజామాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రూప్స్, ఎస్సెస్సీ, ఆర్ఆర్‌బీ, పోలీస్ నియామకాలకు సంబంధించి ఉచిత శిక్షణకు అభ్యర్థులు వచ్చేనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



## పొంగిపొర్లుతున్న కొల్లూరు వాగు..

**అక్షరటుడే, కోటగిరి :** జిల్లాలో మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కోటగిరి మండలంలోని కొల్లూరు వాగు పొంగిపొర్లుతోంది. కొల్లూరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుడడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోతంగల్ మండలం కొల్లూర్ సర్పంచ్ జగన్ సూచించారు. వాగు పొంగిపొర్లుతుండడంతో బోధన్ నుంచి సుంకిని, కొల్లూర్ వచ్చే వాహనదారులు, ఇటువైపు నుంచి రావొద్దన్నారు. అలాగే కొల్లూరు నుంచి అటువైపు వెళ్లకుండా జీపీ అధికారులు ట్రాక్టర్‌ను అడ్డుపెట్టారు. భారీవర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. శిథిలావస్థలకు చేరిన ఇళ్లలో ఉండవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితిలో తప్ప బయటకు రాకూడదని కోరారు. భారీ వర్షాల కారణంగా కరెంటు స్తంభాలకు తాకకూడదని అన్నారు.